

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## అబ్దుల్ అజీజ్ ఇంటికి సీఎం రంగస్వామి



**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త-వైద్యం** నేను వక్ఫ్‌బోర్డు చైర్మన్ కావడంతో పుదుచ్చేరి ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ అధినేత, ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఇంటికి వచ్చి కలిశాడని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, తెలుగుదేశం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. సోమవారం నగరంలోని హరినాథపురంలో ఉన్న షేక్ అబ్దుల్ నివాసానికి ఉదయం 10గంటలకు చేరుకున్నారు. గతంలో అబ్దుల్ అజీజ్‌కి రంగస్వామికి సాన్నిహిత్యం, స్నేహసంబంధాలు ఉండటంతో ప్రస్తుతం అబ్దుల్ అజీజ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అవడంతో ఆయనకి శుభాకాంక్షలు తెలిపేందుకు నెల్లూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిరువురు ఎంత ఉల్లాసంగా పలు విషయాలపై పిచ్చాపాటి చర్చించుకున్నారు. అనంతరం అల్పాహార విందు గావించారు. మా ఇద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం వల్ల అభినందనలు తెలిపేందుకు ముఖ్యమంత్రి వచ్చినట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మీడియాతో మాట్లాడుతూ తను వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ముఖ్యమంత్రికి తనకి ఉన్న సాన్నిహిత్యం వల్ల తనను అభినందించేందుకు యానాంకు వెళ్లే దారిలో నెల్లూరులోని తన నివాసానికి వచ్చారని అజీజ్ తెలిపారు. అందరం కలిసి అల్పాహారం సేవించామని, చంద్రబాబు ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఆంధ్ర రాష్ట్ర ప్రజల అదృష్టమని చంద్రబాబు అడ్మినిస్ట్రేషన్ చాలా బాగుంటుందని రంగస్వామి కొనియాడారు అని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్ సోదరుడు జలీల్ ఉన్నారు.

## మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో రామనారాయణరెడ్డి భేటీ




**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త -వైద్యం** నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహానికి సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన నగరానికి మాజీ ముఖ్యమంత్రి భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి రామనారాయణరెడ్డి సన్మానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో వారి క్యాబినెట్లో ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ప్రత్యేక అనుబంధ వారితో మంత్రి ఆనంకి ఉంది. గోదావరి, కృష్ణాజలాల పంపకం, సాగునీటి విషయాలపై ఇరువురు ప్రత్యేకంగా చర్చించామని మంత్రి తెలిపాడు. నెల్లూరుకు వచ్చినప్పుడు వారిని గౌరవపూర్వకంగా కలవడం నా బాధ్యతగా భావిస్తున్నాను. వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశానన్నారు.

## మాజీ సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన వీపీఆర్ఆర్



**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త-వైద్యం** మాజీ ముఖ్యమంత్రి భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డికి మంగళవారం నెల్లూరు నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహానికి పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరక్టర్, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి కిరణ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.

## అబ్దుల్ అజీజ్‌తో ఎంపీ రఖీబుల్ హుస్సేన్ భేటీ



**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త-వైద్యం** ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో అస్సాం ధుబోరి ఎంపీ రఖీబుల్ హుస్సేన్ మంగళవారం నెల్లూరు నగరానికి విచ్చేసి, అబ్దుల్ అజీజ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ ఆయన సోదరుడు జలీల్‌లు రఖీబుల్ హుస్సేన్‌ని శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రజలలో ఉండే వ్యక్తిని వారు భారీ మెజార్టీతో గెలిపిస్తారంటాడు. నిత్యం ప్రజల్లో ఉంటాడు కాబట్టే హుస్సేన్ భారీ విజయం అందుకున్నాడని అజీజ్ తెలిపాడు. అబ్దుల్ అజీజ్‌తో పాటు ఆయన సోదరుడు అబ్దుల్ జలీల్ ఉన్నారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న 500 రేషన్ బియ్యంబస్తాల లారీ సీజ్



**దగదర్తి, జనవరి 6 ప్రభాతవార్త** దగదర్తి మండలంలోని లయన్స్ నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం అక్రమంగా తరలిస్తున్న 500 రేషన్ బియ్యం బస్తాల లారీని దగదర్తి పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. కందుకూరు ప్రాంతంనుండి నెల్లూరువైపుకు వెళుతున్న ఈ లారీని స్థానికుల సమాచారంమేరకు అదుపులోకి తీసుకుని లారీని సీజ్ చేయడం జరిగింది. అనంతరం దగదర్తి పోలీసుస్టేషన్‌కు తరలించడం జరిగింది. రేషన్ బియ్యం లారీలోడును కోవూరు రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు సమాచారం. అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు తీసుకుంటామని కావలి రూరల్ సిఐ పాపారావు తెలియచేశారు. సీజ్ చేసిన లారీని పోలీసు స్టేషన్‌నుంచి తప్పించేందుకు కొంతమంది నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

## జిల్లాలో హెల్త్ పెన్షన్‌ల వెరిఫికేషన్ టీంలు కేటాయింపు



**నెల్లూరు, జనవరి 6,ప్రభాతవార్త – కలెక్టరేట్** ప్రభుత్వ ఆదేశాలు మేరకు జనవరి 6 తేదీ నుండి 30వ తేదీ లోపు (9 పని దినాలు) జిల్లా లో గల 1274 హెల్త్ పెన్షన్ లన వెరిఫై ,చేయవలసిన కార్యక్రమంలో భాగుంగా హెల్త్ పెన్షన్‌ల వెరిఫికేషన్ కొరకు జిల్లా లో టీంలన తిరుపతి, చిత్తూరు జిల్లాల నుండి కేటాయుంప బడిన డాక్టర్‌లతో ఏర్పాటు చేయడమైనది. టీంలో స్పెషలిస్టట డాక్టర్ 1, జనరల్ మెడిసిన్ 1, మెడికల్ ఆఫీసర్ 1 మరియు డేటా ఎంట్రీ కొరకు డిజిటల్ అసిస్టుటుంట్ 1 మొత్తం 4 సభులతో 7 టీం లన ఏర్పాటు చేయడమైనది. సోమవారం ఉదయుం డి.ఆర్.డి.ఏ కార్యాలయం లో ఎన్టీఆర్ భరోసా పెనషన్ వెరిఫికేషన్ ఆప్ పై శిక్షణ ఇచి వారికి కేటాయుంచిన ముండలాలకు పంపడం జరిగింది . ఈ కార్యక్రమంలో వి.నాగ రాజ కుమారి పిడి, డి.ఆర్.డి.ఏ, సిద్ధ నాయక్, సూపరింటెండెంట్ జి జి హెచ్, రమేష్ నాద్, డీ సీ హెచ్ యస్, మస్తాన్ బాష, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ కాలేజీ పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ప్రమాదంపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆరా



**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు వద్ద రోడ్డు లో స్కూల్ బస్సు ప్రమాదానికి గురౌడంపై కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆరా తీశారు. ప్రమాదంలో గాయపడిన పిల్లల ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్రగాయాలు అయిన కాంత్రి సందేశ్ అనే విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై తండ్రి రమేష్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది విద్యార్థులు సురక్షింతంగా ఉన్నట్లు ఆమె తెలుసుకున్నారు. ఏదైనా అత్యవసరం అయితే తనను సంప్రదించాలని,అన్ని వేళలా అందుబాటులో ఉంటానని విజ్ఞప్తి చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రజాసేవే ముఖ్యం... పదవులు కాదు

- సీఎం కావాలని ఎవరిని అడగలేదు
- కృష్ణాజలాలపై స్టే తెచ్చా.. అది అలాగే ఉంది
- ప్రజలకు సరైన సేవ అందించలేక వైదొలిగా
- బీజేపీ జగన్‌కి సపోర్టు చేయడం లేదు
- మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి



**నెల్లూరు,జనవరి 6, ప్రభాతవార్త-వైద్యం** రాజకీయాలలో పదవులు శాశ్వతం కాదని, ప్రజా సేవ చేస్తేనే ప్రజ గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకోవచ్చని మాజీ ముఖ్యమంత్రి, భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని భారతీయ జనతా పార్టీ, నెల్లూరు జిల్లా కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన హయాంలో నెల్లూరు జిల్లాలో అభివృద్ధి కొరకు తీసుకున్న చర్యలను వివరించారు. నెల్లూరులోని మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశానని, ఆత్మకూరులో వంద పడకల ఆసుపత్రి, రెండు రెవెన్యూ డివిజన్లతో పాటు జిల్లాలో రెండు మున్సిపాలిటీల స్థాపనలను ఆయన ప్రస్తావించారు. నేను ముఖ్యమంత్రి హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీ, ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. పదవులు పొందడం, కోల్పోవడం నుదుటి రాతే తప్ప మన చేతుల్లో లేదని, పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమని ఆయన అన్నారు. తనకు ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యే సీటు ఇవ్వబోతున్నారన్న ప్రచారాన్ని ఖండించారు. తన హోదాకు తగిన ప్రశ్నలు అడగాలని సూచించారు. జీవితంలో ఏ పదవి శాశ్వతం కాదు, కేవలం మాజీ అనేది మాత్రమే శాశ్వతం అని చమత్కరించారు. తగిన సమయంలో బీజేపీ నాయకులుగా ప్రజల ముందుకు వస్తామని, జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్ విభజన త్వరలోనే జరగనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. కృష్ణా జిలాల విషయంలో గతంలోనే చంద్రబాబును కలిసి చర్చించానన్నారు. నేను ముఖ్యమంత్రి పదవి ఎవరిని అడగలేదని, దాని కోసం ఎవరికి కప్పు టీ కూడా ఇవ్వలేదని నల్లారి తెలిపారు. పదవి వచ్చినప్పుడు ప్రజలకు ఎలా మేలు చేయాలనేది ఆలోచించాలని, ప్రజలకు మేలు చేయాలనే తలంపుతోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశానని ఆయన ఉద్ఘాటించారు. పార్టీ బాగుంటుందని అనేక సార్లు అధిష్టానానికి వారు పెడచెవిన పెట్టారన్నారని, వాళ్లు వినకపోవడంతోనే నేను మీడియా ముందుకు వచ్చానని కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. నరేంద్ర మోడీని మూడు నెలల ముందు కలిసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదని ఆయన తెలియజేశారు. ఇప్పటికి కృష్ణా జలాలకు సంబంధించి ఇరు రాష్ట్రాలకు సమస్య ఉందని, ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ఒక వరమని చెప్పారు. పోలవరం పనులను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల 20వేల ఎకరాల కొత్త ఆయకట్టు, 900 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి పోలవరంతోనే సాధ్యం అవుతుందని అన్నారు. పక్క రాష్ట్రాలతో త్వరగా ఒప్పందాలు పూర్తి చేసుకోవాలని, కృష్ణా జలాల్లో ఏపీ, తెలంగాణాలకు జరిగిన అన్యాయంప నేను సీఎంగా ఉన్నప్పుడు సుప్రీంకోర్టులో స్టే తెచ్చానని, ఆ స్టే ఇప్పటికి అలాగే ఉందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్ర ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసికట్టుగా కృష్ణా జలాల వినియోగంపై దృష్టి సారించాలని నల్లారి సూచించారు. అమరావతిని త్వరగా పూర్తి చేసుకోవాలని, ఎంత వేగంగా అభివృద్ధి చేస్తే అంతకంటే వేగంగా నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కిరణ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఏపీ అప్పులమయంగా మారిందని, అభివృద్ధిలో కూడా భాగా వెనుకపడ్డామని చెప్పారు. చంద్రబాబునాయుడు అభివృద్ధిని వేగవంతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జమిలి ఎన్నికల బిల్లుతో పాటు మరిన్ని బిల్లులకు పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉందని పేర్కొన్నారు. జగన్‌కు బీజేపీ సపోర్టు చేస్తుందని అనడం సరికాదన్నారు. అది కోర్టుల్లో ఉన్న వ్యవహారమని, సీబీఐ, ఈడీ, కోర్టులకు సంబంధించినదని, ఏడాదిలోపే విచారణ పూర్తి కావాల్సి ఉన్నా, ప్రజాస్వామ్యంలో లొసుగుల వల్ల జాప్యం జరుగుతుండవచ్చని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్రంలో బలోపేతం అవుతోందని కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, నెల్లూరు జిల్లా ఆర్టీసీ రీజనల్ చైర్మన్ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకా నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్, ఆంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు యర్రబోలు రాజేష్, యశ్వంత్‌సింగ్, ఇండ్ల రాఘవేంద్ర, మండ్ల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు పరుశురాం, దాసరి ప్రసాద్, చిలకా ప్రవీన్ కుమార్, గుత్తా అశోక్ నాయుడు, ప్రసాద్, పొట్లూరు శ్రీనివాసులు, ముక్కు రాధాకృష్ణ గౌడ్, మళ్లీ రవి, పద్మ, చిలకల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాములు, ధనుష్, పిడుగు లోకేష్, ముని తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 247 అర్జీలు



**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త – కలెక్టరేట్** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జడ్పీ డిప్యూటీ సిఇవో మోహన్‌రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. దివ్యాంగుల ట్రైసైకిళ్ల తయారీని ప్రారంభించాలి దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయం పరిధిలో వున్న ట్రైసైకిళ్ల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి ఆధ్వర్యంలో వికలాంగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నెల్లూరులో వున్న ట్రై సైకిళ్ల కర్మాగారం నుంచి ట్రై సైకిళ్లు తయారుచేసి జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోని వికలాంగులకు అందించేవారని, గత కొంతకాలంగా ఇక్కడ తయారీని నిలుపుదల చేసినట్లు చెప్పారు. దివ్యాంగుల కార్పొరేషన్ అధికారులు తమను చుల కనభావంతో చూస్తున్నారని, ఉద్దేశపూర్వకంగా ఇక్క డ సైకిళ్లను తయారు చేయడం లేదని, వెంటనే ట్రైసైకిళ్ల కర్మాగారాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి వికలాంగులకు సహాయం చేయాలని కోరారు. బధిరులు జిల్లా కలెక్టర్ ను కలిసి పుష్ప గుచ్ఛాం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 247 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 247 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 138, మున్సిపల్‌శాఖకు సంబంధించి 21, సర్వేకు 17, పంచాయతీరాజ్‌శాఖకు 14, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 8 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ, హౌసింగ్ పీడీలు నాగరాజ కుమారి, వేణుగోపాల్, ఎస్‌సి, బిసి ,ఎస్టీ వెల్ఫేర్ అధికారులు శోభారాణి,వెంకట లక్ష్మమ్మ ,పరిమళ, డిటిసి చందర్, డిఇఒ బాలాజీ రావు, పిడి డ్వామా గంగా భవాని, డిఎంహెచ్ఓసుజాత, డిసిఓ గుర్రప్ప,ఎలక్ట్రికల్, ఆర్అండ్‌బి, పంచాయత్ రాజ్, ఆర్అండ్‌బి ఎస్ఈలు, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజూ లక్ష ఉపాధిహామీ పనిదినాలు లక్ష్యంగా పనిచేయండి

- మంజూరైన ప్రతి సిమెంటు రోడ్డు వేగంగా పూర్తి కావాలి
- ఎస్‌టిలకు ఆధార్ కార్డులు ఇప్పించడం మన కనీస బాధ్యత
- మార్చిలోగా గృహనిర్మాణాల పూర్తికి చర్యలు
- పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త – కలెక్టరేట్** ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఉపాధిహామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, పంచాయతీ రాజ్ సీసీ రోడ్ల గ్రౌండింగ్, ఎంఎస్ఎంఈ సర్వే, ఎస్టీలకు ఆధార్‌కార్డుల జారీ, పిఎం సూర్యఘర్ యోజన పథకం అమలు మొద్కలెన అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల వేగం పెంచాలని, ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఎంపిడివోలు, ఎపివోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సిసి రోడ్లు, కెటిల్ షెడ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలలో చేపట్టిన మంచినీటి వసతి సౌకర్యం, టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్చిలోగా 10369 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని, ఈ మేరకు హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. హౌసింగ్ లేఅవుట్లలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. సిమెంటు, ఇసుకకు ఎటువంటి ఇబ్బంది లేదని, బిల్లులు కూడా సకాలంలో మంజూరవుతున్నాయని చెప్పారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సిసి రోడ్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే సిమెంటురోడ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినా కూడా ఇంకా మొదలుపెట్టని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోడ్డు నిర్మాణం కూడా మొద్కలె పనులు వేగంగా జరగాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు లేక ఎటువంటి ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్న ఎస్‌టిల పట్ల మానవతాదృకృథంతో వ్యవహరించాలని, వారికి ఆధార్ కార్డులు ఇప్పించడం మన కనీస బాధ్యతగా భావించాలని కలెక్టర్ అన్నారు. నాన్ అవైలబులిటీ, ఎల్‌ఆర్‌బిడి సర్టిఫికెట్లు ఇచ్చి బర్త్ సర్టిఫికెటు మంజూరు చేయాలన్నారు. బర్త్ సర్టిఫికెట్ ఆధారంగా వెంటనే ఎస్‌టిలకు ఆధార్‌కార్డులను ఇప్పించేందుకు ఆర్డీవోలు ప్రత్యేకంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. పిఎం సూర్యఘర్ యోజన పథకంపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ ఒక్కొక్క సెక్షన్ పరిధిలో 5 దరఖాస్తులు చేయించాలన్నారు. రిజిస్ట్రేషన్, వెండర్ సెలక్షన్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్, సబ్సిడీ మెద్కలెన దశలను పక్కాగా అమలు చేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయం పరిధిలో హౌస్ హోల్డ్ సర్వే, ఎం ఎస్ ఎం ఈ సర్వేను పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. హౌస్‌హోల్డ్‌లో మిస్సయిన సుమారు 40వేల మంది విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సమీప సచివాలయ సిబ్బంది సహకారంతో మ్యాపింగ్ చేయించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్ , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి , జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా, డిఆర్‌డిఎ పిడిలు వేణుగోపాల్ , గంగా భవాని, నాగరాజకుమారి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## అనుమతుల మేరకే నూతన భవన నిర్మాణాలు చేపట్టండి: కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 6,ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమతుల మేరకే నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని, అతిక్రమించిన వాటిని తప్పనిసరిగా తొలగిస్తామని కమిషనర్ సూర్య తేజ ప్రజలకు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సూచించిన నిర్మాణ నిబంధనల మేరకు, అనుమతించిన వరకు మాత్రమే ఎలాంటి నిర్మాణాలైనా చేపట్టాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులను కేవలం 24 గంటల్లోనే మంజూరు చేస్తున్నామని, నిర్మాణం అవసరమైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి అని కమిషనర్ సూచించారు. నిబంధనలను, నిర్దేశించిన అనుమతులను ఉల్లంఘించిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని, ఆయా నిర్మాణాలను కూల్చివేస్తామని కమిషనర్ హెచ్చరించారు. నగరపాలక సంస్థ భవన నిర్మాణ అనుమతులతో పాటు ఫైర్, విద్యుత్, ఇతర ప్రభుత్వ విభాగాల అనుమతులతో పాటు ప్రధానంగా ఆక్యుపెన్సి సర్టిఫికెట్ లేకుండా వ్యాపార వాణిజ్య వ్యవహారాలకై నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలను వినియోగించకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలోని పార్కులను శుభ్రంగా నగర ప్రజలకు ఆహ్లాదముగా ఉండునట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్ కుమార్ వారికి ఆదేశాలు జారీ చేశారు.

**హెల్ప్ లైన్ కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే పరిష్కారం** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదుదా రులు తమ సమస్యలను 94940 18118 నెంబ రుకు వాట్సప్ ద్వారా లేదా 0861 2356777, 08612316777 హెల్ప్ లైన్ నెంబర్లకు ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల లోపు తెలియజేయాలని కోరారు. అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియచేసి తక్షణమే సదరు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. విభాగాల వారీగా అడ్మినిస్ట్రేషన్ -2, ఇంజనీరింగ్-17, హౌసింగ్-7, పబ్లిక్ హెల్త్-4, టౌన్ ప్లానింగ్-14, పెన్షన్-2, మొత్తం 46 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, సిటీ ప్లానర్ హిమబిందు, డాక్టర్ చైతన్య,, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగన్నపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**సైదాపురం, జనవరి 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగన్నపాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో మండల వ్యవసాయశాఖాధికారిణి హైమావతి సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు వేసిన నిమ్మ పంట పొ లాలను ఆమె పరిశీలించి రైతులకు తగు సూచనలు అందించారు. సేంద్రియ పద్ధతిలో ఎరువులు వాడటం ద్వారా వేరు కుళ్ళు నివారించవచ్చని ఆమె రైతులకు తెలిపారు. వ్యవసాయశాఖ సహాయకులు మదన్, స్వరూపారాణి, నాయకులు సుబ్బరాజు, రైతులు పాల్గొన్నారు.



## ఉదయగిరి మండల సమైక్య సిబ్బందితో సమీక్ష

**ఉదయగిరి, జనవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి వెలుగు మండల సమైక్య సమావేశం స్థానిక శ్రీ శక్తి భవనంలో జరిగింది. ఈ సమావేశంలో ఏపీఎం మహమ్మద్ ఖాజా రహమతుల్లా శ్రీనిధి సబ్ ప్లాన్ వీఓఆర్ఎఫ్ సీఐఎఫ్ ఇన్కమ్ సర్వే లోకాస్ వీపీఆర్పీ సర్వే అంశాలపై వీఓఏలతో సమీక్ష నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రికవరిలో వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఓసీసీలు తదితరులు పాల్గొన్నారు.



## సనాతన సాంప్రదాయ పద్ధతిలో పండుగలు జరుపుకోవాలి

**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త-వైద్యం :** వేదాయపాలెం, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహ న్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో సోమవారం కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా), బ్లాక్ బోర్డు మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో సనాతన సాంప్రదాయంలో భాగంగా ప్రకృతి, పర్యావరణం, సాంప్రదాయాల పరిరక్షణే పండుగల పరమార్థం అనే కరపత్రికను సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, భోగి పండుగ నాడు కొంత మంది ఆకతాయి పిల్లలు భోగిమంటల్లో టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, రబ్బలు వంటి వాటిని వేయడం వల్ల వాటి నుండి వెలువడే రసాయనాలు మన ఆరోగ్యాన్ని తీవ్రంగా నష్టపరుస్తాయని అన్నారు. సాంప్రదాయ ప్రారంభ దినంలో పాత వస్తువులైన గంప, చాట, చీపురు, మంచం, ఈతాకు, తుంగ ఇంతకుమించి వస్తువులను భోగిలో కాల్చేవాళ్ళని, కాల క్రమేన ప్లాస్టిక్, ఫైబర్ వచ్చిచేరి కాలుష్యాన్ని పెంచేశాయని, ఇకనైనా మనం కళ్ళు తెరవక పోతే ప్రకృతిలో కాలుష్యం విపరీతమై అనారోగ్యాలకు గురికాక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కే.శ్యాం ప్రసాద్ శశాంక్ మాట్లాడుతూ నవనాగరిక సమాజంలో టైర్లు, ట్యూబులు మామూలుగానే కాలుష్యం అయితే వాటిని భోగిమంటల్లో వేసి మరింత కాలుష్య కర్మాగారాన్ని తయారు చేస్తున్నారని, దీని వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు టీబీ, క్యాన్సర్ వచ్చేఅవకాశం ఉందన్నారు. బ్లాక్ బోర్డ్ మిత్ర మండలి అధ్యక్షులు నరసాపురం ప్రసాద్ మాట్లాడుతూ చిన్న పిల్లల నుండి వృద్దుల వరకు కాలుష్య కోరల్లో చిక్కుకుపోయి ఊపిరితిత్తుల, శ్వాసకోశ, టీబీ, నిమోనియా, సీఓపీడీ వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని, కావున ఇకనైనా వీటిపై ప్రత్యేక దృష్టి కనపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ఎంపీ అధ్యక్షులు కోలా రవీంద్రబాబు, పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, షేక్ మహమ్మద్ గౌస్, కే.రామ రాఘవయ్య, షేక్ గౌస్ భాషా తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేసిన రత్నమ్మ ఫౌండేషన్

**కావలిరూరల్, జనవరి 6 ప్రభాతవార్త** విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బివి రత్నమ్మ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షులు విశ్రాంత అధ్యాపకులు ఎంవి ప్రసాదరావు ఆధ్వర్యంలో కావలి వెంగళరావునగర్‌లోని విశ్వశాంతి పాఠశాలనందు సోమవారం జాతీయఆర్థిక ఉపకారవేతనం కొరకు ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన నమూనా పరీక్షలలో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా కావలి ఐఎంఎ కోశాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి విచ్చేసి వింజమూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వెంగ శరణ్య, జి.హిమబిందు, జలదంకి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి టి.కైలాష్‌నాథ్ మెమోంటోలు, ప్రశంసాపత్రాలు, రైటింగ్ పాడ్స్ పంపిణి చేసి 30 మందికి ప్రోత్సాహక బహుమతులు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్రాంత అధ్యాపకులు ప్రసాదరావు వ్యయప్రయాసాలతో ఇటువంటి పోటీపరీక్షలు విద్యార్థులకు నిర్వహించడంవలన వారిలో దాగిఉన్న పోటీతత్వం, ఏకాగ్రతకు దోహదపడుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అజిత్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు రఘునాథ్‌రావు, హ్యాపీసేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా, షేక్.జమీర్, బి.బాలిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల పాల్గొన్నారు.



## బిజ్జంపల్లి పాఠశాలలో వ్యాసరచన పోటీలు

**ఉదయగిరి, జనవరి 6, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని బిజ్జంపల్లి పాఠశాల నందు సోమవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయగిరి మండలం బిజ్జంపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిజ్జంపల్లి ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో భారతదేశదేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే, ఫాతిమా బేగం జీవిత చరిత్రల గురించి ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి నాయబ్ రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులు ఫరీద్ భాష, అన్వర్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## తొలగించిన ప్రాంతాల్లోనే వైసిపి ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలి..!

**కావలి, జనవరి 6 ప్రభాతవార్త :** కావలి పట్టణ ట్రంకురోడ్డులోని పలుసెంటర్లలో ఏర్పాటుచేసిన వైసిపి పార్టీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించడం సమంజసంకాదని, తొలగించినచోటే వెంటనే ఆ ఫ్లెక్సీలను ఏర్పాటుచేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కావలి మున్సిపల్ కార్యాలయానికి వైసిపి నేతలు వెళ్లారు. అక్కడ ఉన్న అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైసిపి పట్టణ అద్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు పండిటి కామరాజు, వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కనపర్తి రాజశేఖర్, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరి చిన్నపుల్లయ్య, పేరం వెంకటేశ్వర్లు, వైసిపి జిల్లా యాక్టివిటీ కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ముందుస్తు సమాచారం ఇవ్వకుండా వైసిపిపార్టీకి చెందిన ఫ్లెక్సీలే తొలగించడం దారుణమన్నారు. కావలి మున్సిపల్ కమీషనర్ అన్నిపార్టీలను ఒకేవిధంగా చూడాల్సిన బాధత్య ఆయనకు ఉందన్నారు. పక్షపాత ధోరణితో ఒక్క వైసిపి ఫ్లెక్సీలనే తొలగించడం మంచి పద్ధతికాదన్నారు. కావలి పట్టణ ట్రంకురోడ్డులోని వివిధ సెంటర్లలో ఏర్పాటుచేసిన ఆరు వైసిపి ఫ్లెక్సీలను తొలగించడం ఏమిటని వారు ప్రశ్నించారు. పట్టణంలోని బిపియస్ సెంటర్, కోర్టు సెంటర్, బ్రిడ్జి సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్, తహశీల్దారు కార్యాలయం, జనతాపేటవద్ద ఏర్పాటుచేసిన వైసిపి ఫ్లెక్సీలను మాత్రమే మున్సిపల్ కమీషనర్ తొలగించారన్నారు. పట్టణంలో ఏ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించకుండా ఒక్క వైసిపిపార్టీ ఫ్లెక్సీలను మాత్రమే తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. అన్ని పార్టీలకు సమన్యాయం కల్పించాలన్నారు. ముందుస్తుగా తమకు సమాచారమిస్తే మా ఫ్లెక్సీలను మేమే తొలగించుకుంటాం కదా.. అని వారు తెలిపారు. మున్సిపల్ కమీషనర్ వెంటనే తొలగించిన ప్రాంతాల్లోనే వైసిపి ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమీషనర్ పరిపాలనలో పక్షపాతధోరణి వ్యవహరించకూడదని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలని వారు కోరారు.



## ప్రసన్న పరామర్శ

**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు వి. మధుసూదన్‌రెడ్డి తండ్రి వెంకురెడ్డి ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో సోమవారం వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్‌రెడ్డి పాటూరులోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి నిరంజన్‌బాబురెడ్డి, ఉపాధ్యక్షులు రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీలత, మండల ఏఎబీ మాజీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి , ప్రచార విభాగం అధ్యక్షులు అనూప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, పార్టీ నాయకులు ఆదిపరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేంద్ర, కమలాకర్, మల్లికార్జున, తదితరులు ఉన్నారు.



## దివ్యాంగుల ఇంటిస్థలాలను సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి

**కావలిరూరల్, జనవరి 6 ప్రభాతవార్త:** కావలి మండలంలో దివ్యాంగుల ఇంటిస్థలాలను సచివాలయాల్లో నమోదు చేసుకుని వారికి అండగా ఉండాలని తెలుగుదేశంపార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షుడు మండవ వెంకటరావు కోరారు. మండవ వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంవద్ద దివ్యాంగులతో కలిసి నిరసన నినాదాలుచేసి ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రాన్ని అందచేసి మాట్లాడారు. కావలి డివిజన్‌లోని కొన్ని మండలాలలో ముఖ్యంగా కావలి మండలంలో దివ్యాంగుల ఇంటిస్థలాలకు సచివాలయాల్లో నమోదు చేసుకోవడంలేదని దివ్యాంగులను సచివాలయాలచుట్టూ తిప్పుకోవడమేకాకుండా వారికి సరైన సమాధానంకూడా చెప్పకుండా సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలియచేశారు. గత వైసిపిపాలనలోలాగ ప్రస్తుత పాలనలోకూడా దివ్యాంగులకు అధికారులు సరైన సమాధానం చెప్పకుండా కార్యాలయాలచుట్టూ తిప్పుకోవడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. కావలి డివిజన్‌లో కొన్ని మండలాలలో నమోదు చేసుకుంటున్నారని కాని, కావలి మండలం మరియు కావలి పట్టణంలోని కొన్ని సచివాలయాల్లో దివ్యాంగుల ఇంటిస్థలాలకు సంబంధించి సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆర్డీఓ వంశీకృష్ణ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి దివ్యాంగులకు అండగా ఉండాలని ఆదేశించినందుకు ఆయనకు దివ్యాంగులు ధన్యవాదాలు తెలియచేశారు. దివ్యాంగుల నేతలు తల్లిబోయిన శ్రీనివాసులు, ప్రళయకావేరి రాజు, కోడూరు సోమయ్య, గాలం మాలకొండయ్య, శెట్టిపల్లిరామయ్య, సుబ్రహ్మణ్యం, బాషా, మరియమ్మ, తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.



## సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**ఉదయగిరి, జనవరి 6, ప్రభాతవార్త :** జిల్లాలో జరుగు సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు నాయ కులు, అభిమానులు శ్రేయోభిలాషులు అధికంగా తరలి రావాలని సీపీఎం సీఐటీయు నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక పట్టంలోని వివిధ కార్యాలయాలు అధికారులను కలిసి సీపీఎం రాష్ట్ర 27వ రాష్ట్ర మహాసభలను పాల్గొని విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో జరుగునని, ఈ పార్టీ కార్మికుల పక్షాన పార్టీ అని, ఈ మహాసభకు కార్మిక కర్షక ప్రజా సంఘాల నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు వేలాదిగా తరలిరావాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ఆహ్వానించారు. అనంతరం మోడీ ప్రభుత్వం నిరంకుశ ధోరణి ప్రజలపై అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను వివరిస్తూ రాజ్యాంగ నిర్మాతను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు గడ్డం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## భవిత కేంద్రం ఆకస్మిక తనిఖీ

**ఉదయగిరి, జనవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి-2 తోట శ్రీనివాసులు ఎంపీపీఎస్ ఉదయగిరి దళిత వాడ పాఠశాల నందు నిర్వహిస్తున్న భవిత కేంద్రంను తనిఖీ చేసి దివ్యాంగులైన విద్యార్థులకు చేస్తున్న ఫిజియోథెరపిని పరిశీలించారు. దివ్యాంగులైన విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి, తాము దివ్యాంగుల అనే భావన విద్యార్థులలో రాకుండా ఫిజియోథెరపీ చేయాలని ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరికి సూచించారు. తదుపరి ఫిజియోథెరపి పరికరాలను పరిశీలిస్తూ డిసెంబర్ 19వ తేదీన వెంకటాచలంలోని సీఆర్పీ సెంటర్ నందు జరిగిన దివ్యాంగ విద్యార్థుల పారా ఒలంపిక్స్ నందు పరుగు పందెంలో ద్వితీయ బహుమతి సాధించిన ఎస్డీ యాకోబును అభినందించారు. మాసాయిపేట మెయిన్, ఉర్దూ, హరిజన వాడ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయురాలు జి.అనురాధ, షేక్ అర్షియాని అభినందించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పరిశీలిస్తూ భోజనం ఇంకాస్త రుచికరంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల గణిత విషయ సామర్థ్యాలను వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నాయని, 5వ తరగతి విద్యార్థి గోవర్ధన్‌ను అభినందించారు.



## పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం

**వరికుంటపాడు, జనవరి 6, ప్రభాతవార్త :** రాష్ట్రీయ గోకుల్ మిషన్ లో భాగంగా మండలంలోని మహ్మదాపురం గ్రామంలో మండల పశు వైద్యాధికారి రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నెల్లూరు పశు గణాభివృద్ధి సంస్థ ఈఓ డా.డి శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. పాడి పశువులకు గర్భకోశవ్యాధికి సంబందించి చికిత్స అందించడంతో పాటు పాడి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు పశు గణాభివృద్ధి సంస్థ ఈఓ డా.డి శ్రీనివాస్ మాట్లాడుతూ పాడి రైతులు జీవాలలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, పశు వైద్యుల ద్వారానేచికిత్సలను అందించాలన్నారు. ఈ కార్యక్రమములో దుత్తలూరు ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డా.ఎన్ చంద్ర శేఖర్, టిడిపి నేతలు గంగవరపు పుల్లయ్యనాయుడు, చంద్ర ప్రభాకర్‌నాయుడు ,పశు పోషకులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలకు కావలి పుట్టినిల్లు.. జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

### సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట

**కావలి, జనవరి 6 ప్రభాతవార్త :** క్రీడలకు కావలి పుట్టినిల్లని, ఇక్కడి క్రీడాకారులు జాతీయస్థాయిలో ఎదగాలని సోమశిలప్రాజెక్టు మాజీచైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు తెలిపారు. కావలి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విట్స్‌కళాశాల గ్రౌండ్‌లో 2వరోజు సోమవారం ఆటలో గెలిచి ప్రతిభచాటిచెప్పిన మ్యాన్‌ఆఫ్‌మ్యాచ్ అవార్డును కండ్లగుంట అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొట్టమొదటిసారి కేసిఏ ఆధ్వర్యంలో కావలి విట్స్‌గ్రౌండ్‌లో ఇంతభారీగా ఏర్పాటుచేసిన కమిటీకి జనసేన సీనియర్‌నేత, కేసిఏ అద్యక్షుడు ఎంవి సిద్దుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సహకారంతో రాబోయేకాలంలో కావలి క్రీడలకు బాగా మంచిప్రోత్సాహం లభిస్తుందన్నారు. జాతీయస్థాయిలో మంచి క్రీడాకారులు తయారవుతారన్నారు. కేసిఏ కమిటీకి తాము వెన్నంటిఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## హత్యకేసులో ఏడుగురు ముద్దాయిలు అరెస్ట్ : డీఎస్పీ పి.శ్రీధర్

**కావలి, జనవరి 6 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గం అల్లూరు మండలంలోని నార్త్ మోపూరు సెంటర్‌లో జరిగిన హత్యోదంతంలో 7 గురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. సోమవారం కావలి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీధర్ వివరాలు వెల్లడించారు. అల్లూరు మండలం అరుంధతీయవాడ నార్త్ మోపూరుకు చెందిన చేజర్ల కార్తీక్ జనవరి 1వ తేది హత్యకు గురయ్యాడని తెలిపారు. అల్లూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసుకు సంబంధించి ఈ నెల 5వ తేదీ 7 మందిని అరెస్ట్ చేశామన్నారు. మరో ముద్దాయి మనోజ్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. వారివద్ద ఉన్న ఒక సుత్తి, నాలుగు కర్రలు, మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. డిసెంబర్ 31వ తేది అర్ధరాత్రి తర్వాత న్యూ ఇయర్ సందర్భంగా నార్త్ మోపూరు హరిజనవాడకు చెందిన కొమ్మి సుధీర్, తుమ్మపాటి ఆదిత్య అలియాస్ నాని, కొమ్మి నరేష్, మనోజ్‌లు మరికొంతమందితో కలిసి నార్త్ మోపూరు గ్రామసెంటర్‌కు మోటార్ సైకిళ్లపై వచ్చి పెద్దగా అరుస్తూ తిరుగుతున్నారన్నారు. ఈ సమయంలో నార్త్ మోపూరు అరుంధతీయవాడకు చెందిన జంపాల నిరంజన్ కలుగచేసుకుని ఎందుకు అరుస్తూ తిరుగుతున్నారని వారిని నిలదీశారు. వారు నిరంజన్‌తో గొడవపెట్టుకోగా వారి మధ్య వాదన జరిగిందన్నారు. మోడెం అనిల్ వారికి సర్దిచెప్పి అక్కడినుంచి అందరిని పంపివేశారన్నారు. ఈ గొడవను మనసులో పెట్టుకుని నార్త్ మోపూరు హరిజనవాడకు చెందిన ఈ ముద్దాయిలు మోటార్‌సైకిళ్లమీద సుత్తి, కర్రలు పెట్టుకుని నార్త్ మోపూరు అరుంధతీయవాడకు వెళ్ల రోడ్డుసెంటర్‌వద్దకు వెళ్లారు. నిరంజన్‌ను చంపాలని ఉద్దేశంతో అక్కడ ఉన్న శివకుమార్, నిరంజన్‌లతో గొడవపడ్డారన్నారు. కార్తీక్ అడ్డంరాగా వారందరూ కలిసి కార్తీక్‌ను చంపాలనే ఉద్దేశంతో సుత్తితో తల వెనుకభాగంలో గట్టిగా దాడిచేశారన్నారు. బలమైన రక్తగాయం కారణంగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి కార్తీక్ చనిపోయాడన్నారు. ఈ కేసుకు సంబంధించి 7 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.-ముద్దాయిలు వీరే.చేజర్ల కార్తీక్ హత్యోదంతంలో కొమ్మి సుధీర్, తుమ్మతాటి ఆదిత్య అలియాస్ నాని, కొమ్మి నరేష్, అరగల బాలు, కొమ్మి అహరాన్ అలియాస్ లక్ష్మయ్య, అజ్యం హేమంత్‌కుమార్, తోటపూడి జగదీష్‌లను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మనోజ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నందున అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలమేరకు కావలి డీఎస్పీ ఆధ్వర్యంలో కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి.పాపారావు, ఎస్ఐలు గ్రామంలో పికెట్స్ ఏర్పాటుచేసి లా అండ్ ఆర్డర్‌ను అదుపులోకి తెచ్చి ముద్దాయిలను త్వరితగతిన అరెస్ట్‌చేయడం జరిగిందని తెలిపారు. ముద్దాయిలను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపర్చినవారిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ బి.పాపారావు, అల్లూరు ఎస్ఐ కె.కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



## గీతాంజలిలో 'హాక్' డే

**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఒక్క రోజు హాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కోడింగ్ స్కిల్‌లో తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించేందుకు ఒక వినూత్న వేదికగా ఉపయోగపడిందన్నారు. ముఖ్యంగా ఈ హాక్ డే కార్యక్రమం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్, మిషన్ లెర్నింగ్ వంటి ప్రాజెక్టులు రూపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి. గాయత్రి, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ పి. నాగేంద్రకుమార్, సీఎస్ అండ్ డీఎస్ విభాగాధిపతి టి. సాయిప్రసాద్‌రెడ్డి, కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ ఆర్. రజని, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.



## మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు ఉండాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ మ ధ్యాహ్న భోజన పథకం తయారు చేసే ఏజె న్సీలు, తయారు చేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉం చుకోవడమే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయాలన్నారు. విద్యార్థులతో పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



## గ్రూపు సభ్యుల్లో మరింత అవగాహన పెంచాలి

**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** పొదుపు గ్రూపు సభ్యుల్లో బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా బ్యాంకుకు చెల్లించడమే కాకుండా వారి ఆర్థికాభివృద్ధిని ఘనసీయంగా పెంచేలా వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని అన్ని సంఘాల వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలను లక్షాధికారులుగా చేయాలనే ప్రభుత్వ సూచనల మేరకు గ్రూపుల్లో ఉత్సాహంగా ఉన్న సభ్యులను గుర్తించాలన్నారు. తద్వారా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాలపై వారు దృష్టి సారించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలను క్రమం తప్పకుండా తిరిగి చెల్లించి రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉంచుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, చైతన్య, రాము, శోభ, ఉన్నారు.



## భూగర్భ జలాలు అడుగెంటుతున్నాయ్-పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉంది

**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 6, ప్రభాతవార్త :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో పరిశ్రమలు అధికంగా రావడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యుడు శ్రీరాములు వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ముత్తుకూరు మండలంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు నీరు లేకపోయినా బోర్ల ద్వారా నీళ్లను తోడేస్తున్నారని దీనివల్ల ఈ ప్రాంతంలో నీళ్ల లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. ముత్తుకూరు మండలంలో ఉన్న పారిశ్రామిక వేత్తలకు, అధికారులకు వాల్టా చట్టం ఉందని మర్చిపోయారని గుర్తు చేశారు. గతంలో పది అడుగుల్లో నీరు వచ్చే ముత్తుకూరు మండలంలో ప్రస్తుతం 70 అడుగులు తవ్విన నీరు చెప్పారు. బోర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులు నీరును తోడేసి పరిశ్రమలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడంవల్ల పర్యావరణం, వాతావరణ కాలుష్యం పూర్తిగా దెబ్బతింటుందని దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని జరిగిందన్నారు. వారు స్పందించి ఈ ప్రాంతంలో భూగర్భ జలాలను పరిశీలించేందుకు సెంట్రల్ ఎన్విరాన్మెంట్, పొల్యూషన్, భూగర్భ జలాల అధికారులు స్పందించి దీనిపై సమగ్ర రిపోర్టు ను అందించేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కు ఆధారాలతో సహా తీసుకొని రమ్మని పిలవడం జరిగిందన్నారు. ముత్తుకూరు మండలం భూగర్భ జలాలపై సమాచారాన్ని అధికారులకు అందించడం జరుగుతుందన్నారు. దీనిపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముత్తుకూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల ఉత్పత్తులు తయారు చేయాలంటే లక్షల గ్యాలరీలు అవసరమని, అయితే ఈ నీళ్లను స్థానికంగా ఉన్న కొంతమంది బోర్ల ద్వారా దొడ్డి దారిన ఒక్క రూపాయి చెల్లించకుండా నీళ్లను తోడేస్తున్నారని ఆరోపించారు. ముత్తు కూరులో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానికంగా ఉన్న వారికి ఒక్కరికి కూడా పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వలేదని



## కొనసాగుతున్న కైలాసనాథ దేవాలయ పనులు

**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కైలాసనాథ స్వామి దేవస్థాన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 1.20 కోట్ల వ్య యం తో ఈ నూతన ఆలయ నిర్మాణ పనులు గత సంవత్సరం పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. అప్పటి నుంచి ఈ పనులు పొందిన కాంట్రాక్టర్ ఈ కైలాసనాథ స్వామి దేవస్థాన నిర్మాణ పనులను అత్యంత వైభవంగా శిల్పుల పర్య వేక్షణలో చేపడుతున్నారు. కనీసం ఉగాది నాటికి ఈ నిర్మాణ పనులు పూర్తయ్యేలా సంబంధిత పనులు పొందిన కాంట్రాక్టర్ తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.




## తెలుగు పరిమళం రచయితతో విద్యార్థుల ముఖాముఖి



**నెల్లూరు, జనవరి6 ప్రభాతవార్త-విద్య :** తొమ్మిదవ తరగతి పాఠ్యపుస్తకాల్లో తెలుగు పరిమళం వాచకంలో మైలు రాయి ,ఫ్లెమింగో ఫెస్టివల్, విడిది పక్షుల దీర్ఘ కవిత రచించిన సింహపురీయులు, ప్రముఖ రచయత డాక్టర్ పెరుగు రామకృష్ణ సోమవారం నగరంలోనిస్థానిక మైపాడురోడ్డు నేతనగర్‌లోని ఎస్‌విఆర్ ఆంగ్ల ఉ న్నత పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేల పట్టు , పులికాట్ సరస్సుకు విచ్చేసే విడిది పక్షుల జీవనం, కట్టుబాట్లు, క్రమశిక్షణ, పక్షి శాస్త్రవేత్తల నుండి తాను గ్రహించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. పక్షి జీవన విధానం నుండి మనిషి నేర్చుకో వాల్సిన అంశాలను బోధించారు. పాఠశాల కరస్పాండెంట్ అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమేష్‌బాబులు మాట్లాడుతు మంచి కార్యక్రమాన్ని తమ పాఠశాలలో నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. పాఠా ్యంశాల రచయిత పెరుగు మన నెల్లూరు వారు అవ్వడం గర్వకారణమని, సమయం లేకునా ్న తాము ఆహ్వానించిన వెంటనే విద్యార్థులతో మమేకమయ్యేందుకు ఆయన తమ పాఠశాలకు రావటం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు పెరుగు సమాదానాలను అందించారు. రచయితను పాఠశాల యాజమాన్యం ఘనంగా సతకరించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యను పరిష్కరించండి

**నెల్లూరు, జనవరి6, ప్రభాతవార్త-కలెక్టరేట్** సోమవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తి క్కన్న భవనంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో నెల్లూరు జిల్లాలో అర్హులైన దివ్యాం గులకు ఇచ్చే ట్రై సైకిళ్ళ తయారీ కర్మగారాలో ట్రై సైకిళ్లు సమయానికి తయారు చేయకుండా అడ్డుప డుతున్న ఇన్చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్/జిల్లా మేనేజర్ వినయ్‌కుమార్ నెల్లూరు జిల్లా దివ్యాంగుల కార్పొరేషన్ అధికారి నాగభూషణం ల మీద విచారణ చేపిం చి చర్యలు తీసుకోవాలని కోరిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి





**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని వెలుగు కార్యాలయంలో ఎపిఎం శ్రీదర్ నేతృత్వంలో ఎంపిడిఓ శ్రీహరి,తహసిల్దారు అంబటి వెంక టేశ్వర్లు పొదుపు మహిళలతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని,కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని వారు సూచించారు.మొక్కలు నాటే సమయంలో కేవలం నీడనిచ్చే మొక్కలే కాకుండా పండ్లు కాచే మొక్కలు కూడా నాటాలని వారు సూచించారు.పండ్లు కాచే చెట్లు నాటితే ఎన్నో మూగజీవాలకు అహారం దొరుకుతుందని అన్నారు. వెలుగు కార్యాలయంలో ఎక్కువగా పండ్లు కాచే మొక్కలు నాటడాన్ని పరిశీలించిన వారు ఎపిఎం శ్రీదర్ని,పొదుపు మహిళలను అభినందించారు. అనంతరం ఎంపిడిఓ శ్రీహరిని, తహసిల్దారు అంబటివెంకటేశ్వర్లుని సన్మానించారు.ఈకార్యక్రమంలో పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## నిరంతర శ్రమజీవి షేక్.సుబాన్‌బాషా



**సంగం జనవరి 6 ప్రభాతవార్త** నలబై ఒక్క సంవత్సరాలు అన్నారెడ్డిపాళెం పాల ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘంలో సెక్రటరీగా పనిచేసి షేక్. సుభానీభాషా నేడు పదవి విరమణ చేశారని ఆయన శేషజీవితం సంతోషంగా ఉండాలని విజయపాలడైరీ ఎం.డి పి.సి కృష్ణమోహన్ స్పష్టం చేశారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని పాలడిపోలో సెక్రటరీ షేక్.సుభానీ భాషా పదవివిరమణ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతు సుభానీ బాషా నిరంతర శ్రమజీవి అని కొనియాడారు. పాలసొసైటీకోసం ఎంతో కృషి చేశారని,సొసైటీని జిల్లాలో ఒక ఉన్నత స్థాయిలో నిలిపారని ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అన్నారెడ్డిపాళెం సొసైటీవారు సుభాన్‌భాషాకి 80 వేలు నగదు పారితోషకంగా అందజేశారు. మేనేజర్ రాజశే ఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, అన్నారెడ్డిపాళెం సొసైటీ అద్యక్షులు బేతు సుబ్రమణ్యం, దామమడుగు సెక్రటరీ బి.వెంకురెడ్డి, సీద్దిపురం సెక్రటరీ సిహె చ్.శ్రీనివాసులు, అన్నారెడ్డిపాళెం సొసైటీ సెక్రటరీ రవి, మాజీ అధ్యక్షులు పచ్చిపాల పద్మనాభరెడ్డి, దేగా వెంకయ్య,బేతు వెంకటేశ్వర్లు, ,సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన కావలి ఎమ్మెల్యే



**కావలి, జనవరి 6 ప్రభాతవార్త** రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామానారాయణరెడ్డిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కలిశారు. సోమవారం నెల్లూరులోని మంత్రి ఆనం కార్యాలయంలో ఆయనను కలిశారు.కొండ బిట్రగుంట, ఇతర దేవస్థానాల్లో చేపట్టాల్సిన పలుకార్యక్రమాలను మంత్రి ఆనం దృష్టికి తీసుకువెళ్లి వివరించారు. కావలి నియోజకవర్గంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మంత్రి ఆనంను కోరారు. ఎమ్మెల్యే దగుమాటి చెప్పిన విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట బీద గిరిధర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి, పాల్గొన్నారు.

## కాలువలో పడిపోయిన స్కూల్ బస్సు

## 25 మంది విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం



**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామ సమీపంలో నెల్లూరు రూరల్‌కి చెందిన స్కూల్ బస్సు అదుపు తప్పి కాలువలోపడిపోయింది. విద్యార్థులను ఎక్కించుకొని వెళుతన్న బస్సుగుంతలు ఉండడంతో డ్రైవర్ బ్రైక్ కోట్టడంతో స్టీరింగ్ కంట్రోల్ కాకు బస్సు అదుపు తప్పి బోల్తా పడిపోయింది. కండిషన్ లేని బస్సును వేశారంటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సంఘటన జరిగిన సమీ పంలో విద్యార్థులను స్ధానికులు బయటకుతీసేశారు.లేదంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. అయితే తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కండిషన్‌లేని బస్సు విషయం అనేక సార్లు యాజమాన్యంకు చెప్పినా పట్టించుకోలేదని తల్లిదండ్రులుఆగ్రహంవ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్ధలానికి చేరుకొని కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

## వీబీఆర్, వీపీఆర్‌ఆర్‌లను సన్మానించిన కార్పొరేటర్లు



**నెల్లూరు, జనవరి 6, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నారాయణ విద్యాసూంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంస్థ డైరక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డిలను నగరంలోని హరినాధపురంలో ఉన్నవీబీఆర్ నివాసంలో నగరానికి చెందిన పలువురు కార్పొరేటర్లు వారిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## గోల్డ్‌మెడల్ విజేతలకు జిల్లా అర్చరీ అసోసియేషన్ అభినందన




**నెల్లూరు,జనవరి6 ప్రభాతవార్త-విద్య** జనవరి మూడు నుండి ఐదవ తేదీ వరకు రాజస్ధాన్‌లోని జైపూర్ పూర్ణిమా యూనివర్సిటీలో నిర్వహించిన 41వ ఎన్‌టిపిసి సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ చాంఫియన్ షిప్ పోటీల్లో మిక్సిడ్ విభాగంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా గూడూరుకు చెందిన ఆర్.సాయి మౌర్య, కృష్ణాజిల్లాకు చెందిన యుక్తశ్రీలు విజయం సాధించి గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. ఈ సందర్బగా జిల్లా అర్చరీ అసోసియేషన్ అధ్యక్ష్య, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణులు విజేతలతోపాటూ కోచ్ శివశంకర్‌ను అభినందించారు. భవిష్యత్‌లో వీరు మరిన్ని విజయాలు సాధించాలని వారు కోరారు.

## ఉల్లాసంగా, ఉత్సాహంగా క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే



**వింజమూరు,జనవరి6,ప్రభాతవార్త:** యువత ఉల్లాసంగా, ఉత్సాహంగా క్రీడల్లో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం వింజమూరులోని ఎంఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలోని క్రీడా మైదానంలో విఎంసిఎ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్స్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే నివాసం నుండి మోటర్‌బైక్‌లతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బైక్‌పై యువత, స్థానిక టిడిపి నాయకులతో కలిసి క్రీడా మైదానానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేకు మేళతాళాలతో టోర్నమెంట్ నిర్వాహకులు ఆహ్వానించారు. క్రీడా మైదానంలో ఎమ్మెల్యే టాస్కు వేసి బ్యాటింగ్ ఎంచుకోగా కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి బౌలింగ్ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ విఎంసిఎ క్రికెట్ టోర్నమెంట్ వారు గడిచిన 15సంవత్సరాల నుండి ఈ టోర్నమెంట్‌ను సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేస్తూ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గడిచిన రెండు సంవత్సరాల నుండి తాను కూడా ప్రతి ఏడాది క్రీడా పోటీల సమయంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహాన్ని అందిస్తున్న విషయం విదితమేనన్నారు. కాగా ప్రస్తుతం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనందున క్రీడలకు ప్రతి సంవత్సరం ఎమ్మెల్యే నిధుల నుండి 10శాతం క్రీడలకు కేటాయిస్తానన్నారు.నియోజకవర్గంలోని యువత చదువు, క్రీడలతోపాటు ఉపాది మార్గాల వైపు పయనించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధియువత ఉద్యోగాల వైపు వెళ్ళినప్పుడే జరుగుతుందన్నారు. ఫిబ్రవరిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంతో క్రీడాకారులు స్నేహభావంతో ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావ్, మాజీ తెలుగుయువత అధ్యక్షుడు గణపం సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, కరణం శ్రీనివాసులునాయుడు, తిరుపతాచారి, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, గవ్వల వెంకి,ఎస్.కె.ఖాజావలి, స్థానిక ఎస్ఐ వీరప్రతాప్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ సందాని, సురేష్, ప్రకాష్, సిద్ధిక్, సునీల్, వెలుగోటి కృష్ణ, టోర్నమెంట్ దాతలు పల్లాల ప్రసాద్‌రెడ్డి, ఈస్ట్ ఉర్దూ పాఠశాల చైర్మెన్ మధుబాబు, హై ప్లేయర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలుగోటిరోజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాకాణిని కలిసిన గణపం




**వింజమూరు,జనవరి6,ప్రభాతవార్త:** వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్‌ఆర్‌సిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గణపం రమేష్‌రెడ్డి , స్థానిక జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డితో కలిసి మండలంలోని వివిధ వైసిపి నాయకులతో కలిసి సోమవారం కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి తనపై గురుతరమైన బాధ్యతను పెట్టిందని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా వైసిపి ముఖ్యనేతల సూచనలు, సలహాలతో పార్టీకి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈసందర్భంగా కాకాణి మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సిపికి రమేష్‌రెడ్డి రాకతో వింజమూరు మండలంలో వైసిపికి నూతన ఉత్సాహం వచ్చిందన్నారు. పెద్ద ఎత్తున నెల్లూరుకు వచ్చి తనకు కృతజ్ఞతలు తెలిపినందుకు ఆనందంగా ఉందన్నారు. రమేష్‌రెడ్డి పార్టీకోసం నిబద్ధతతో ఏ పదవి లేనిస మయంలోనే తన సొంత నిధులను వెచ్చిస్తూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం తెలిసిందేనన్నారు. ఇలాంటి యువ నాయకుడితో వైసిపికి మరింత బలం చేకూరిందన్నారు. మండలంలోని సీనియర్, జూనియర్ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ , మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, సొసైటీ మాజీ చైర్మెన్‌లు మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, నాయకులు వీరారెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, మద్దూరు చంద్రశేఖర్‌రెడ్డి, నీలం సంజీవరెడ్డి, అంకినపల్లి నర్సింహారెడ్డి, నల్లగంగుల పెంచలరెడ్డి, అనిమిరెడ్డి, రాజేంద్ర, మస్తాన్, ఇతర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## మేకపాటిని కలిసిన వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదరి



**వింజమూరు, జనవరి6,ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గ సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి , వింజమూరు యువ నాయకుడు గణపం రమేష్‌రెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాలతో సన్మానించారు . ఈసందర్భంగా రాజగోపాల్‌రెడ్డి గణపం రమేష్‌రెడ్డిని అభినందిస్తూ వింజమూరు మండలంలో వైసిపికి పూర్వ వైభవం తెచ్చేందుకు నేతలు, కార్యకర్తలతో కలసి వ్యూహాత్మకంగా వ్యవహరించి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు ముందుండి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. రానున్న రోజులు వైసిపివేనని , ఎవరూ అధైర్యపడకుండా ప్రస్తుత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, ఆనంగి రమణయ్య, ఆనంగి రాజేష్, మద్దూరు చంద్రశేఖర్‌రెడ్డి,నల్లగంగు పెంచలరెడ్డి,దాట్ల రమణారెడ్డి,పోలుబోయిన మాల్యాద్రి , మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, మద్దిరెడ్డి వీరారెడ్డి, మస్తాన్, సుధాకర్‌రెడ్డి, బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ నుడా డైరెక్టర్ షేక్ ఖాజావలిని మేయర్ పరామర్శ



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 6,ప్రభాతవార్త:** మాజీ నుడా డైరెక్టర్ షేక్ ఖాజావలి వారి సతీమణి గత కొద్ది కాలంగా అనారోగ్యం తో బాధ పడుతూ శుక్రవారం తుదిశ్వాస విడవగా, నెల్లూరు బాలాజీ నగర్ లోని వారి నివాసంలో ఖాజావలిని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతిజయవర్ధన్ దంపతులు సోమవారం పరామర్శించారు.

## అటవీ ప్రాంతాల్లో మైనింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు



**సైదాపురం, జనవరి 6, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో ఉన్న అటవీ ప్రాంతాల్లో అక్ర మంగా మైనింగ్ నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నెల్లూరు అటవీశాఖ రేంజర్ ఎస్.మాల్యాద్రి హెచ్చరించారు. మండల పరిధిలోని తోకలపూడి, తూర్పుపూండ్ల, మొలకలపూండ్ల గ్రామంలో ఉన్న అటవీ భూములను సోమవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా అటవీ భూముల్లోకి ప్రవేశించి మైనింగ్ నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా అటవీ సంపద అయిన చెట్లను నరికిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం సైదాపురం కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ నర్సరీని మాల్యాద్రి పరిశీలించారు. ఆయనతో పాటు నెల్లూరు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్లు రవిశేఖర్, గిరిజాకుమారి, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆర్యవైశ్యుల సేవలు ఆదర్శప్రాయం



**నెల్లూరు,జనవరి6 ప్రభాతవార్త-విద్య** నిత్యం సేవా కార్యక్రమాలు చేపడతూ ప్రజలకు మంచి చేసే ఆర్యవైశ్యుల సేవలు ఆదర్శప్రాయమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్థానిక స్టోన్ హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడకల్లో కోటంరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు.గతం నుండి చూస్తే పాఠశాలలు, కళాశాలలు,సత్రాలు,తదితర వాటిని ఆర్యవైశ్యుల పూర్వీకులు ఏర్పాటుచేసి నిర్వహించేవారికి గుర్తుచేశారు. ప్రస్తుతం అర్బన్ ఆర్యవైశ్య సంఘం నేతలు ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు బారీగా దుప్పట్లను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కాండా ప్రవీణ్ శంకర్ మాట్లాడుతు పాండురంగ అన్నదాన సమాజం అధ్యక్షులుగా ఉన్న సమయంలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం పేదలకు దుపట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు కోట సత్యనారాయణ, రమేష్‌బాబు, శేగు షణ్ముగరావు, కోటా గురుబ్రహ్మం గుప్త, దుగ్గిశెట్టి అశోక్, సురేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ డే కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించాలి



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త** : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఫిబ్రవరి నెలలో నిర్వహించే సైన్స్‌డే కార్యక్రమానికి సంబంధించి సంబంధిత సైన్స్ ఉపాధ్యాయులు, పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పచ్చిపాల మల్లికార్జునరెడ్డిలతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే సైన్స్‌డే కార్యక్రమాన్ని ఒక వినూత్న పంథాలో నిర్వహించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సైన్స్‌లో గుణతస్థానంలో ఉన్న వారిని ఆహ్వానించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత వెలికితీసేందుకు ఈ సైన్స్‌డే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు.

- పదిలో 590 మార్కులు సాధిస్తే రూ. లక్ష బహుమతి కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు రానున్న పదవ తరగతి పరీక్షల్లో 590 మార్కులు సాధిస్తే వారికి తమ ట్రస్టు ద్వారా రూ. లక్ష నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని ఈ సందర్భంగా ట్రస్టు కార్యదర్శి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎంత మంది సాధిస్తే అంతమందికి ఈ నగదు బహుమతి అందజేస్తామన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థినులు పోటీతత్వాన్ని అలవరుచుకుని ఈ నగదు బహుమతిని సాధించాలని ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి తెలిపారు. ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన మల్లికార్జునరెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక,ఉపాధ్యాయులు గీతామాధురి, సైన్స్ ఉపాధ్యాయులు కె. భారతి, డి. శైలజ, ఈ. రాజేశ్వరి, ఉన్నారు.

## ఆగని చికెన్ వేస్ట్ దందా..

### - ప్రత్యేక దృష్టి సారించిన కోవూరు పోలీసులు



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త** : పర్యావరణ పరిరక్షణకు తీవ్రస్థాయిలో విఘాతం కలిగించి పరిసరాలను దుర్వాసన వెదజల్లుతున్న చికెన్ వేస్ట్ అక్రమ రవాణా చాటుమాటుగా కొనసాగుతూనే ఉంది. ఇటీవల కాలంలో కోవూరు పోలీసులు ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి రెండు వారాల వ్యవధిలో ఆరు చికెన్ వేస్ట్ వాహనాలను సీజ్ చేసి వాటిపై కేసు నమోదు చేశారు. ప్రధానంగా ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణా, చెన్నై, బెంగుళూరు నుంచి కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున గంగవరం , ఇనమడుగు ప్రాంతాలకు వస్తున్న రెండు చికెన్ వేస్ట్ వాహనాలను కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు పోలీసులు ఈ వాహనాలను సీజ్ చేసి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కోవూరు ఎఫ్‌డీవో శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేయించారు. అనంతరం ఈ చికెన్ వేస్ట్‌ను పెన్నానది ప్రాంతంలో గొయ్యి తీసి అందులో పూడ్చేలా చర్యలు చేపట్టారు. కోవూరు నియోజకవర్గంలోని ఏ ప్రాంతంలో కూడా చికెన్ వేస్ట్ రవాణా జరగరాదని, ఇది వరకే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సంబంధిత పోలీస్, మత్స్యశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చేపలు సాగుచేసే వారు చికెన్ వేస్ట్ కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఎఫ్‌డీవో శ్రీనివాసులు తెలిపారు.

## ప్రజా పరిష్కార వేదికలో ఖాళీ కుర్చీలు



**కోవూరు, జనవరి 6 ప్రభాతవార్త :** ప్రతి సోమవారం సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ప్రరిష్కార వేదికకు సంబంధించి జిల్లా నుంచి కలెక్టర్ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ కార్యక్రమానికి ప్రతి మండలంలో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అయితే ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఏపీఎం, ఆర్‌అండ్‌బీ, ఎంఈవో, హౌసింగ్ శాఖల అధికారులు మాత్రమే పాల్గొంటున్నారు తప్ప మిగిలిన ప్రధాన శాఖలు హాజరవుతున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా ఇరిగేషన్, ఆర్‌అడబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖ, ఎక్సైజ్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఈ పరిష్కార వేదిక కార్యక్రమానికి డుమ్మా కొడుతున్నారే తప్ప హాజరవుతున్న దాఖలాలు లేవు. ఫలితంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల సమస్యలను ఈ పరిష్కార వేదికలో తెలుసుకుని అవసరమైతే వాటిని అక్కడికక్కడే తేలికపాటి సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. అయితే ప్రధాన శాఖలో ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ఈ గ్రీవెన్స్ డేలో ఇచ్చిన అర్జీలకు ఆశించిన మేర ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు అంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రానున్న సోమవారం నుంచి అయినా అన్ని ప్రధాన శాఖలు ఈ పరిష్కార వేదికకు హాజరయ్యేలా తగు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జొన్నవాడ కామాక్షితాయి హుండి లెక్కింపు



**బుచ్చి జనవరి 6 ప్రభాతవార్త** పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి దేవస్ధానంలో సోమవారం హుండి లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మదాయశాఖ అధికారులు,దేవస్ధానం కార్యనిర్వహణాధికారి సమక్షంలో నిర్వహించారు. 29.10.2024 నుండి 6.10.2025 వరకు అనగా 68 రోజులకు శ్రీవార్ల ప్రధాన ఆలయ హుండి ద్వారా ఆదాయం 33,24,667 వచ్చిందని అధికారులు తెలిపారు. అన్నదానం హుండిల ద్వారా 2,30,057 వచ్చిందని తెలిపారు. బంగారు వస్తువులు 67 గ్రాములు,వెండి వస్తువులు 190 గ్రాములు,యూఎస్‌ఏ డాలర్లు 41 సమర్పించడం జరిగిందని అధికారులు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కోవూరు ఇనస్పెక్టర్ ఆర్ కృష్ణ చైతన్య, ఎన్ శ్రీదర్‌నాయుడు కార్యానిర్వహణా దికారి, రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం, జొన్నవాడ ఆలయ ఇఒ ఆర్యభూమి శ్రీనివాసులురెడ్డి, స్ధానిక ఏపిజి బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది, విద్యాసాగర్ కృష్ణ, ఆద్వర్యంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రిటైడ్ ఉద్యోగులు ,రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఉలవపాడులో గుప్పుమంటున్న గంజాయి

### - యువతే లక్ష్యంగా సాగుతున్న వ్యాపారం

### - బానిసలుగా మారుతున్న విద్యార్థులు

### - పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు





**ఉలవపాడు, జనవరి 6 ,ప్రభాతవార్త** దేశాభివృద్ధిలో కీలకమైన యువత మాదకద్రవ్యాల భారిన పడుతోంది. గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కడ పడితే అక్కడ లభిస్తుండటంతో పదిహేనేళ్లలోపు పిల్లలు మొదలు యువత పలువురు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారు. మత్తు పదార్థాలు వివిధ రూపాల్లో లభిస్తుండటంతో ధూమపానం, మద్యపానం వంటివి క్రమంగా జీవితంలో భాగమై పలువురు విచక్షణ మరిచి నేరాలకు పాల్పడుతున్నారు. అంతే కాక ఈ అలవాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలపైనా ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు మెట్రోపాలిటన్ నగరాలు, పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు మారుమూల పల్లెలకు సైతం పాకింది. ముఖ్యంగా ఉలవపాడు మండలంలో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. ఫలితంగా చాలా మంది విద్యార్థులు, యువత దీనికి అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవడం వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. కొంత మంది యువకులు ముఠాగా ఏర్పడి గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వివిధ మార్గాల్లో గంజాయిని ఉలవపాడుకు ఆకు రూపంలో తీసుకొచ్చి దానిని ఎండబెట్టుకుని పొడిగా మార్చుకుని వారు సేవిస్తుండటమే కాకుండా పొట్లాలుగా మార్చి ఒక ప్యాకెట్ రూ.200ల చొప్పున ఇతరులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీరి వద్ద నుంచి కొనుగోలు చేసిన యువత బాంగ్(నీటి ద్వారా), చులుమ్(గంజాయి సేవించే గొట్టం), ఓసీబీ సిగరెట్ పేపర్లో గంజాయి నింపుకొని తమకు అనువైన పద్ధతిలో చూసేవారికి అనుమానం రాకుండా ఈ గంజాయిని సేవిస్తున్నారు. ఉలవపాడు శివారు ప్రాంతాలైన రిజర్వు కాలనీ, రైల్వే క్వార్టర్స్, వరదాయమ్మ కాలనీ, పాత రైల్వే రోడ్డు ప్రదేశాలతో పాటు నిర్వాసితులకు ఏర్పాటు చేసిన పునరావాస కాలనీల వద్ద విద్యార్థులు, యువత గుంపులు గుంపులుగా ఉంటూ స్టఫ్, జాయింట్ అంటూ పలు రకాల కోడ్లు పెట్టుకొని గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పాత రైల్వే రోడ్డు, హైస్కూల్ సంఘం లోపల ప్రాంతాల్లో గంజాయి విక్రయాలకు పెద్ద ఎత్తున జరుగుతుండడమే కాకుండా అక్కడే గంజాయి సేవిస్తున్నారు.

**యువత తల్లిదండ్రులు ఆందోళన:** కొంత మంది విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గంజాయిని సరదా కోసం తాగి క్రమంలో మార్పు కనిపించి జరిగిన విషయం తెలుసుకొని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. విక్రయదారులు కొందరు విద్యార్థులు, యువతనే లక్ష్యంగా చేసుకుని దందాను గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా పది మంది సర ఫరా దారులు(పెట్లర్లు) ఉన్నట్లు తెలుస్తుంది. గంజాయి తగిన యువత తమ ద్విచక్ర వాహనాలను అతి వేగంగా నడిపిస్తూ రోడ్లపై వెళ్లే ఇతరులను భయాందోళనకు గురిచేస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టకపోవడం వల్లే వీటి అమ్మకాలు విస్తరి స్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నియంత్రణకు చర్యలు:** ఎస్సై అంకమ్మ గంజాయి సరఫరాను అరికట్టేందుకు నిఘా పెట్టాం. గంజాయి విక్రయించినా, తాగినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి విక్రయించే వారి గురించి సమాచారం వచ్చిన వెంటనే స్పందించివారి ఆటకట్టించి జైలుకు పంపిస్తాం. యువత గంజాయికి బానిసై తమ బంగారు భవిష్యత్తునునాశనం చేసుకోవద్దు.తల్లిదండ్రులు వారి పిల్లలపై దృష్టి పెట్టాలి.

